కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్‌/ వనస్థలిపురం లోని రైతుబజారులలో కూరగాయల ధరలు.. టమాట రూ.23, వంకాయ 40, బెండ 35, పచ్చిమిర్చి 35, కాకర 30, బీర 38, క్యాబేజి 23, ఫ్రెంచి బీన్స్‌ 45, క్యారెట్‌ 45, దొండ 23, చిక్కుడు 75, గోకర 45, బీట్‌రూట్‌ 40, క్యాప్సికం 60, ఆలు 23, దోస 18, సొర 15, పొట్ల 18, ఉల్లిగడ్డ 18, చామగడ్డ 23.
ఈ ధరలు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

బీసీ అడ్వకేట్స్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ సమావేశం


సమావేశంలో పాల్గొన్న న్యాయవాదులు

ఎల్‌బీనగర్‌: తెలంగాణ రాష్ట్ర బీసీ అడ్వకేట్స్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు జూపల్లి కృష్ణ అధ్యక్షతన గురువారం ఎల్‌బీనగర్‌లో నిర్వహించిన సమావేశంలో సంస్థ కార్యకలాపాలు, బీసీ న్యాయవాదుల అభివృద్ధి కార్యక్రమాలు, రాబోయే బీసీ జేఏసీ రాష్ట్ర బంద్‌కు సంఘం మద్దతు వంటి అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో గట్టిపంపుల బాబురావు, బొమ్మ వెంకటేశ్‌, పాండలై నర్సింహా, శివరాజు, రవి కుమార్‌ యాదవ్‌, కల్లరమేశ్‌, జాయింట్‌ సెక్రటరీలు రాజేశ్వర్‌, బ్రహ్మచారి,అంజయ్యగౌడ్‌ పాల్గొన్నారు. బీసీ హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం రాజ్యాంగ సవరణలు చేపట్టి, బీసీ వర్గాల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తీర్మానం చేశారు.

పైపులైన్‌ పనులకు శంకుస్థాపన


పనులకు శంకుస్థాపన చేస్తున్న మధుసూదన్‌రెడ్డి

చంపాపేట: చంపాపేట డివిజన్‌ శుభోదయ కాలనీలోని దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన తాగునీటి పైపులైన్‌ స్థానంలో నూతన లైన్‌ ఏర్పాటు చేయటంతో లో ప్రెజర్‌ సమస్యకు చెక్‌ పడుతుందని కార్పొరేటర్‌ వంగ మధుసూదన్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన తాగునీటి పైపులైన్‌ విస్తరణ పనులకు జలమండలి మేనేజర్‌ రమ్యభారతితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధులు శ్రీకాంత్‌గౌడ్‌, నాయకులు రవీందర్‌రెడ్డి, దశరథగౌడ్‌, శ్రీధర్‌గౌడ్‌, నగేష్‌, బాలు పాల్గొన్నారు.

వైభవంగా స్వామివారి కల్యాణం



నాగోలు: నాగోలు సాయినగర్‌ కాలనీలో సిద్దల శంకర్‌ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన మల్లికార్జున స్వామి కల్యాణ మహోత్సవంలో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చింతల సురేందర్‌ యాదవ్‌, సిద్దల ఐలయ్య, కాలనీవాసులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మహిళ అదృశ్యం


సంతోషి

నాగోలు: ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన ఓ మహిళ అదృశ్యమైన ఘటన నాగోలు పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..నాగోలు జైపురికాలనీలో కందుల బాలరెడ్డి, భార్య సంతోషి(35), కుమార్తెలో కలిసి ఉంటున్నారు. ఈ నెల 9న ఇంట్లో చిన్న గొడవ జరిగింది. 10న బాల్‌రెడ్డి పనికి వెళ్లిపోయాడు. కుమార్తె కాలేజీకి వెళ్లిన తర్వాత సంతోషి తాళం వేసి వెళ్లిపోయింది. సాయంత్రం ఇంటికి వచ్చిన బాల్‌రెడ్డికి సంతోషి కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



హస్తినాపురం: అనుమానాస్పద స్థితిలో గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం .. బుధవారం రాత్రి రాంరాజ్‌ కాటన్‌ షాపు దగ్గర రోడ్డు పక్కన ఓ వ్యక్తి స్పృహ లేకుండా పడిఉన్నట్లు గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు 108 సహాయంతో వనస్థలిపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఉస్మానియా ఆసుత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి వయస్సు 35- 40 ఉంటుందని ఒంటిపై మెరూన్‌ కలర్‌ షర్టు, బ్లూకలర్‌ ప్యాంట్‌ ఉందని సంబంధీకులు ఉంటే పోలీస్‌ స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

అధికారులు ఉండరు.. సిబ్బంది రారు!

- కాలనీ,బస్తీలో తిష్ట వేస్తున్న సమస్యలు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- కార్యాలయాల్లో కానరాని అధికారులు
- వెనుదిరుగుతున్న ఫిర్యాదుదారులు


సరూర్‌నగర్‌ సర్కిల్‌ కార్యాలయం

దిల్‌సుఖ్‌నగర్‌: ప్రజా సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాల్సిన అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తుండటంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. వివిధ సమస్యలపై ఫిరాయదు చేసేందుకు సంబంధిత కార్యాలయాలకు వెళ్తే అక్కడ ఏ అధికారి కూడా అందుబాటులో ఉండటం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో ఆయా ప్రాంతాల్లో సమస్యలు ఎక్కడికక్కడే తిష్ట వేస్తున్నాయి. ఒకవేళ కార్యాలయాల్లో అధికారులు అందుబాటులో ఉండి ప్రజా సమస్యలను పరిష్కరించాలని కిందిస్థాయి ఉద్యోగులకు ఆదేశాలు జారీ చేసినా ఎలాంటి పురోగతి ఉండటం లేదు. దీంతో చేసేదేమీ లేక ప్రజలు సమస్యలతో సహజీవనం చేయాల్సిన దుస్థితి నెలకొంది.

కార్యాలయాల్లో ఫిర్యాదుదారుల ఎదురు చూపులు

సరూర్‌నగర్‌, మలక్‌పేట్‌, సంతోష్‌నగర్‌ సర్కిళ్ల పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు, సిబ్బంది ఎవరు ప్రజలకు అందుబాటులో ఉండటం లేదు. ఎన్‌టీఆర్‌నగర్‌, భగత్‌సింగ్‌నగర్‌, అంబేడ్కర్‌నగర్‌, వాంబేకాలనీ, తీగలగూడ, కమలానగర్‌, మూసానగర్‌, మాదన్నపేట్‌, తదితర కాలనీల్లో కనీస సౌకర్యాలు లేక ఇక్కట్లకు గురవుతున్నారు. మలక్‌పేట్‌, సరూర్‌నగర్‌ సర్కిల్‌ కార్యాలయాల్లో పారిశుద్ధ్య, ఇంజినీరింగ్‌, టౌన్‌ప్లానింగ్‌, ఎలక్ట్రికల్‌, హర్టికల్చర్‌, రెవెన్యూ తదితర విభాగాలకు చెందిన అధికారు లెవ్వరూ ఎప్పుడు కూడా తమ తమ ఛాంబర్‌లో ఉండటం లేదని వారికోసం గంటల తరబడి ఎదురు చూసినా ఎంతకీ రాకపోవడంతో నిరాశతో ఇళ్లకు వెనుతిరిగి తర్వాతి రోజు వచ్చినా లాభం లేకుండా పోతోందని అక్కడికొస్తున్న ఫిర్యాదుదారులు వాపోతున్నారు.

అక్రమ నిర్మాణాలపై అధిక ఫిర్యాదులు

ఆర్‌కేపురం, మూసారంబాగ్‌, ఐఎస్‌సదన్‌, సైదాబాద్‌, అజంపుర, కుర్మగూడ తదితర డివిజన్ల నుంచి వందకు పైగానే ఫిర్యాదు వస్తున్నాయి. వీటిలో అధిక శాతం అక్రమ నిర్మాణాలు, డ్రైనేజీ, రోడ్లు, వీధి దీపాలు, పారిశుద్ధ్య సమస్యలు ఎక్కువగా వస్తుంటాయి. వచ్చిన ఫిర్యాదులను వెంటనే డీసీ వాటిని సంబంధిత అధికారులకు పంపించినా అధికారులెవ్వరూ పట్టించుకోవడం లేదు, దీనిపై వారితో మాట్లాదామంటే ఎవ్వరు అందుబాటులో ఉండటం లేదు అడిగితే పొంతనలేని సమాధానాలు, దీనితో చేసేదేమీలేక సమస్యలతో నెట్టుకొస్తున్నారు. గత కొన్ని నెలలుగా ఇదే పరిస్థితి ఉండటంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కాలనీలలో కనీస సౌకర్యాలు కల్పించకుండా తమతమ సొంత పనుల్లో నిమగ్నమవుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. కార్యాలయాల్లో అధికారులు లేకుంటే తమ సమస్యలు ఎవరికి చెప్పుకోవాలంటే ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారులు పర్యవేక్షణ లేక అధికారులు, సిబ్బంది ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని పలువురు ప్రజాప్రతినిధులు బాహాటంగానే విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కాలనీ, బస్తీల సమస్యలను పరిష్కరించాలని, లేకుంటే సర్కిల్‌ కార్యాలయాల ఎదుట ధర్నాలు చేస్తామని ఆయా ప్రాంతాల ప్రజలు హెచ్చరిస్తున్నారు.

వేధింపులకు పాల్పడితే చర్యలు తప్పవు


కౌన్సెలింగ్‌ నిర్వహిస్తున్న పోలీస్‌ అధికారి

నాగోలు: బాలికలు, మహిళలను వేధిస్తే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. బస్టాండ్లు, రైల్వే, మెట్రో స్టేషన్లు, స్కూళ్లు, కాలేజీలు, కూరగాయల మార్కెట్లు, బహిరంగ ప్రదేశాల్లో మఫ్టీలో తిరుగుతూ షీ టీమ్స్‌ డెకాయ్‌ ఆపరేషన్లు చేస్తున్నారని, బాలికలను, మహిళలను వెంబడించే, పోకిరీలను పట్టుకొని న్యాయస్థానంలో హాజరు పరుస్తూ వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్‌ ఇస్తున్నారన్నారు. గురువారం ఎల్‌బీనగర్‌లోని రాచకొండ క్యాంప్‌ కార్యాలయంలో ఉన్న ఉమెన్‌ సేఫ్టీ కార్యాలయంలో వారి కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్‌ నిర్వహించారు. మహిళలు వేధింపులకు గురైతే 8712662111ను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ వెంకటేశ్వర్లు సీఐ, ముని, అంజయ్య, అడ్మిన్‌ ఎస్‌ఐ రాజు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలి


మురుగునీటిని పరిశీలిస్తున్నయ సీపీఎం నాయకులు

ఎల్‌బీనగర్‌: నిత్యం వేల సంఖ్యల్లో రాకపోకలు సాగించే రహదారుల్లో డ్రైనేజీ పొంగి పొర్లుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందని సీపీఎం పార్టీ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం ఎల్‌బీనగర్‌ నియోజకవర్గ పరిధిలోని పలు కాలనీలో సీపీఎం ఎల్‌బీనగర్‌ సర్కిల్‌ కార్యదర్శి కీసరి నర్సిరెడ్డితో పాటు పలువురు నాయకులు సామానగర్‌, వెంకటేశ్వరకాలనీ, ముదిరాజ్‌కాలనీ, హయత్‌నగర్‌, భాగ్యలత, ఇంజాపూర్‌ వెళ్లే కాలనీలో పర్యటించారు. ఈ రహదారులపై నిత్యం వందల సంఖ్యలో వాహనాలు, ప్రజలు వివిధ పనుల నిమిత్తం అవసరాలకు వెళ్తుంటారని ఇలాంటి రోడ్లపై నిత్యం డ్రైనేజీ పారడం పట్ల అధికారుల తీరుపై మండిపడ్డారు. అధికారులు క్షేత్రస్థాయి పర్యటనలు చేయకుండా ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని ఆరోపించారు. వెంటనే డ్రైనేజీ లీకేజీలను అరికట్టాలని లేకుంటే ధర్నాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కృష్ణయ్య, గణేష్‌గౌడ్‌, నరహరి, బిట్ల మూర్తి, పబ్బు సత్యనారాయణ, యాదగిరి పాల్గొన్నారు.

బీసీ బంద్‌కు సంపూర్ణ మద్దతు


బంద్‌కు మద్దతు తెలుపుతున్న నేతలు

హస్తినాపురం: ఈ నెల 18న జరగనున్న బీసీ బంద్‌కు రాజ్యాంగ పరిరక్షణ వేదిక, తెలంగాణ ఎంఆర్‌పీఎస్‌ బీసీ జేఏసీ సంస్థలు సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. బీసీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించేలా కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ సవరణ చేసి 9వ షెడ్యూల్‌లో చేర్చాలని రాజ్యాంగ పరిరక్షణ వేదిక కార్యదర్శి చెన్నోజు శ్రీనివాసులు డిమాండ్‌ చేశారు. గురువారం హస్తినాపురం చౌరస్తాలోని అంబేడ్కర్‌ విగ్రహానికి పూలమాలలు వేసి బంద్‌కు మద్దతు ప్రకటించారు. ఈడబ్ల్యూఎస్‌ రిజర్వేషన్లు బీసీలకు మరణశాసనంగా మారాయని, వాటినే వెంటనే రద్దు చేయాలన్నారు. శాసనసభ, పార్లమెంట్‌లో బీసీలకు రిజర్వేషన్లు లేకుండా కేవలం స్థానిక సంస్థలలో మాత్రమే ఇవ్వడం అన్యాయమని చెన్నోజు శ్రీనివాసులు అన్నారు. జూబ్లీహిల్స్‌ ఉపఎన్నికలో రిజర్వేషన్‌ వ్యతిరేక పార్టీలకు అతీతంగా బీసీ అభ్యర్థికి మద్దతు ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రమేశ్‌, సాయికుమార్‌, ఎల్లేశ్‌, దుబ్బ ఆంజనేయులు, నవీన్‌ కుమార్‌, బ్రహ్మయ్య, బచ్చు రామక్రిష్ణ, మల్లెల సుజాత పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

సీపీఎం నిరసన..

దిల్‌సుఖ్‌నగర్‌: బీసీల రిజర్వేషన్లు అమలు చేయాలని సీపీఎం పార్టీ శాఖ కార్యదర్శి గోపినాయక్‌, సరూర్‌నగర్‌ సర్కిల్‌ కార్యవర్గ సభ్యులు కట్ట శ్రీనివాస్‌ డిమాండ్‌ చేశారు. గురువారం ఆర్‌కేపురం డివిజన్‌ ఎన్టీఆర్‌నగర్‌లో నిర్వహించిన నిరసన కార్యక్రమం వారు మాట్లాడారు. బీసీల 42 శాతం రిజర్వేషన్‌ అసెంబ్లీలో ఏకగ్రీవంగా తీర్మానం చేసిన బిల్లును ఆమోదించకపోవడం బాధాకరమన్నారు. బీసీ రిజర్వేషన్ల కోసం 18న జరిగే బంద్‌కు మద్దతు తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జగన్‌యాదవ్‌, మున్న పరమేష్‌, శంకర్‌, షకీల్‌ పాల్గొన్నారు.

నేడు కంటి వైద్య శిబిరం

సైదాబాద్‌: ఉచిత వైద్య శిబిరాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని శ్రీవిజయదుర్గా మాతా దేవాలయం ఆలయ కమిటీ ప్రతినిధి సునీల్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శుక్రవారం సైదాబాద్‌ మాతామైదాన్‌లోని శ్రీవిజయదుర్గా మాతా ఆలయ ప్రాంగణంలో రామాంతపూర్‌ మెడి ఐ కేర్‌ హాస్పిటల్‌ వైద్య సిబ్బందితో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు నిర్వహించే ఈ శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేస్తారన్నారు.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి


డాక్టర్‌ తరుణి

చాదర్‌ఘాట్‌: సీజనల్‌ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఓల్డ్‌మలక్‌పేట యూపీహెచ్‌సీ మెడికల్‌ అధికారి డాక్టర్‌ తరుణి అన్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు దరి చేరవన్నారు. నిల్వ ఆహార పదార్థాలను తినరాదని వేడిగా ఉన్న ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగితే ఆరోగ్యంగా ఉంటామన్నారు.

దివ్యాంగుల అభ్యున్నతికి కృషి

చాదర్‌ఘాట్‌: దివ్యాంగుల అభ్యున్నతికి కృషి చేస్తున్నామని రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్‌ చైర్మన్‌ ముత్తినేని వీరయ్య పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదేళ్ల బీఆర్‌ఎస్‌ ప్రభుత్వ హయాంలో కన్నా సంవత్సర కాలంలో వికలాంగుల సమగ్ర అభివృద్ధికి పాటు పడ్డామన్నారు. వికలాంగులకు ఉన్నత విద్యా, రాజీవ్‌ యువ వికాసం, ఇందిరమ్మ ఇళ్లు, కోర్టు ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించామన్నారు. వికలాంగుల కార్పొరేషన్‌లో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న పీఆర్‌సీలు అందేలా చట్టం చేశామన్నారు. స్పోర్ట్స్‌ పాలసీ ద్వారా వికలాంగులకు ప్రోత్సహకాలు అందిస్తున్నామన్నారు.

మలక్‌పేటలో కాంగ్రెస్‌ బలపడుతుంది


శ్రీనివాస్‌

మలక్‌పేట: మలక్‌పేట నియోజకవర్గంలో కాంగ్రెస్‌ పార్టీ మరింతగా బలపడుతుందని ఆ పార్టీ ఇన్‌చార్జి చేకోలేకర్‌ శ్రీనివాస్‌ అన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూసారంబాగ్‌, అక్బర్‌ బాగ్‌, సైదాబాద్‌, ఓల్డ్‌మలక్‌పేట, ఆజంపుర, ఛావుని డివిజన్లలో బుధవారం నిర్వహించిన 'సంఘటన్‌ శ్రీజన్‌ అభియాన్‌' కార్యక్రమం విజయవంతంగా జరిగిందన్నారు. రాబోయే గ్రేటర్‌ ఎన్నికల్లో విజయం సాధించేదిశగా ముందుకు సాగాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా చూడాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు.

శంకుస్థాపన

చైతన్యపురి: గడ్డిఅన్నారం డివిజన్‌ పరిధిలో నిర్మిస్తున్న బీరప్ప దేవాలయ శంకుస్థాపన కార్యక్రమంలో ఎల్‌బీనగర్‌ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు. పూజలు చేసి కొబ్బరికాయ కొట్టి ఆలయ నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భవాని ప్రవీణ్‌కుమార్‌, చిగుర్ల ఆంజనేయులు, బైర ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.



ట్రాఫిక్‌ నిబంధనలు పాటించాలి


వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న వెంకటేశ్వర్లు

మలక్‌పేట: డ్రంకెన్‌ డ్రైవ్‌, సెల్‌ఫోన్‌ డ్రైవింగ్‌తోనే అధికంగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని సౌత్‌ ఈస్ట్‌ ట్రాఫిక్‌ డీసీపీ ఆర్‌. వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం ఆయన, ట్రాఫిక్‌ అదనపు డీసీపీ రామదాసు తేజావత్‌, ఏసీపీ చంద్రకుమార్‌, మలక్‌పేట ట్రాఫిక్‌ ఇన్‌స్పెక్టర్‌ అశోక్‌కుమార్‌తో కలిసి మలక్‌పేట ట్రాఫిక్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో పర్యటించి ట్రాఫిక్‌ను పరిశీలించారు. మూసారంబాగ్‌ చౌరస్తాలో చేపట్టిన స్పెషల్‌ డ్రైవ్‌లో సెల్‌ఫోన్‌ డ్రైవింగ్‌, రాంగ్‌సైడ్‌ డ్రైవింగ్‌ వంటి ఉల్లంఘనలు అరికట్టేందుకు విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాంగ్‌ సైడ్‌, సెల్‌ఫోన్‌ డ్రైవింగ్‌తో పట్టుబడితే వాహనాలు సీజ్‌ చేస్తామన్నారు. ఈ సందర్భంగా నిబంధనలు ఉల్లంఘించి పట్టుబడిన వారికి కౌన్సెలింగ్‌ ఇచ్చారు.

అక్రమ కట్టడం సీజ్‌


అక్రమ నిర్మాణాన్ని సీజ్‌ చేసిన అధికారులు

సైదాబాద్‌: నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న అక్రమ కట్టడాన్ని అధికారులు సీజ్‌ చేశారు. ఐఎస్‌ సదన్‌ డివిజన్‌ లక్ష్మీనగర్‌ కాలనీ చౌరస్తాలో జీప్లస్‌ టూ అనుమతులు తీసుకున్న బిల్డర్‌ నిబంధనలకు విరుద్ధంగా భారీ సెల్లార్‌ తవ్వారు. ఈ సెల్లార్‌తో చుట్టుపక్కల ఉన్న ఇళ్లకు ప్రమాద జరిగే అవకాశం ఉంటుందని బీజేపీ నాయకుడు వీరేంద్రబాబు జీహెచ్‌ఎంసీ, సంతోష్‌నగర్‌ సర్కిల్‌ టౌన్‌ ప్లానింగ్‌ అధికారులకు ఫిర్యాదు చేశారు. రెండు నెలల క్రితం టౌన్‌ ప్లానింగ్‌ అధికారులు కట్టడాన్ని సీజ్‌ చేసారు. ఐదు రోజులుగా బిల్డర్‌ మళ్లీ నిర్మాణ పనులు చేపట్టగా సమాచారం అందుకున్న టౌన్‌ప్లానింగ్‌ అధికారులు గురువారం మళ్లీ నిర్మాణాన్ని సీజ్‌ చేశారు.

చైతన్యపురి ఠాణా సందర్శించిన డీసీపీ


ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న డీసీపీ అనురాధ

చైతన్యపురి: ఎల్‌బీనగర్‌ జోన్‌ డీసీపీగా ఇటీవల పదవీ బాధ్యతలు స్వీకరించిన డా.అనూరాధ గురువారం చైతన్యపురి పోలీస్‌ స్టేషన్‌ సందర్శించారు. పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో నమోదు అవుతున్న కేసులు, విచారణ, సిబ్బంది పనితీరు తదితర అంశాల గురించి ఇన్‌స్పెక్టర్‌ సైదులును అడిగి తెలుసుకున్నారు. స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో మాట్లాడారు. కేసులకు సంబంధించిన ఫైళ్లను తనిఖీ చేశారు. స్టేషన్‌ పరిధిలోని రౌడీషీటర్లు, అసాంఘిక శక్తులపై నిఘా పెట్టాలన్నారు.

బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలి


సమావేశంలో పాల్గొన్న నర్సింగ్‌ రావు

నాగోలు: 42 శాతం బీసీ రిజర్వేషన్ల సాధనకు ఈనెల 18న బీసీ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించే బంద్‌కు మద్దతు తెలుపుతూ బంద్‌ కార్యక్రమంలో మన ఆలోచన సాధన సమితి(మాస్‌) పాల్గొని విజయవంతం చేయాలని అధ్యక్షుడు కటకం నర్సింగ్‌ రావు పిలుపునిచ్చారు. గురువారం నాగోలులో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇది నిరసన కాదని.. బీసీల హక్కులను చరిత్రలో ముద్రించే ఆత్మగౌరవ బంద్‌ అన్నారు. ఈ బంద్‌లో రాష్ట్ర కార్యవర్గ సభ్యులతో పాటు బీసీ కులాల మేధావులు, విద్యావేత్తలు, ఉద్యోగులు, కుల సంఘాల నాయకులు పాల్గొంటామని ఈ సమావేశంలో నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో నరసింహగౌడ్‌, ఆనందంనేత, నరసింహ, దేవేందర్‌, విద్యాసాగర్‌, శ్రీనివాసులు యాదవ్‌, బ్రహ్మయ్య, చంద్రశేఖర్‌గౌడ్‌, కేశవ్‌, రామచంద్ర గౌడ్‌, మల్లికార్జున్‌గౌడ్‌ పాల్గొన్నారు.

వరద కాలువలో మురుగు కలవనివ్వొద్దు


వ్యర్థాలను తరలింపజేస్తున్న నర్సింహారెడ్డి

మన్సూరాబాద్‌: రసాయన వ్యర్థాలు, డ్రైనేజీ మురుగు వరద కాలువల్లోకి కల్వకుండా చర్యలు చేపట్టాలని మన్సూరాబాద్‌ కార్పొరేటర్‌ కొప్పుల నర్సింహారెడ్డి కోరారు. ఆటోనగర్‌ డంపింగ్‌ యార్డ్‌ ప్రాంతాన్ని గురువారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ఆటోనగర్‌లోని డంపింగ్‌ యార్డ్‌ ప్రాంతంలోని అటవీప్రాంతంలో రసాయనిక వ్యర్థాలతో చెట్లు ఎండిపోవడంతో పాటు వన్యప్రాణులకు ప్రమాదం ఏర్పడుతుందన్నారు. రసాయనిక వ్యర్థాలు, డ్రైనేజీ మురుగు వరదకాలువల్లోకి అక్రమంగా కలుపడంతో సుమారు 7 కాలనీలవాసులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. జలమండలి, జీహెచ్‌ఎంసీ, అటవీశాఖ, అధికారులు సమన్వయంతో సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాంబాబు, సత్యనారాయణరెడ్డి, నరేష్‌, శోభన్‌బాబు, సంతోష్‌, మధు పాల్గొన్నారు.

ఫ్రాన్స్‌ అమ్మాయితో ఇండియా అబ్బాయి పెళ్లి



చైతన్యపురి: చైతన్యపురి డివిజన్‌ ఫణిగిరి కాలనీలో నివసించే వ్యాపారి పొలిశెట్టి సుధాకర్‌ కుమారుడు తరుణ్‌కుమార్‌ ఎంఎస్‌ చేసేందుకు అమెరికా వెళ్లి సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగం చేస్తున్నాడు. అక్కడే ఫ్రాన్స్‌ దేశంలోని లీనాన్స్‌కు చెందిన మెరియన్‌తో పరిచయం ఏర్పడి ప్రేమగా మారింది. నాగోలులోని ఓ ఫంక్షన్‌హాల్లో ఘనంగా వివాహం చేసుకున్నారు.

గుంతల పూడ్చివేత



దిల్‌సుఖ్‌నగర్‌: ఆర్‌కేపురం డివిజన్‌ ఎన్టీఆర్‌నగర్‌లో రోడ్డంతా గుంతలు పడి రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ విషయమై సీనియర్‌ నాయకుడు సాజిద్‌ జీహెచ్‌ఎంసీ ఆధికారుల దృష్టికి తీసుకెళ్లగా గురువారం గుంతలను సిబ్బందితో గుంతలను పూడ్చివేశారు.

రేషన్‌ బియ్యం పట్టివేత

పహాడీషరీఫ్‌: అక్రమంగా తరలిస్తున్న 996 క్వింటాళ్ల రేషన్‌ బియ్యం, 144 క్వింటాళ్ల గోదుమలను పహాడీషరీఫ్‌ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్‌ రాఘవేందర్‌ రెడ్డి వివరాల ప్రకారం..గుజరాత్‌ రాష్ట్రానికి చెందిన లారీ డ్రైవర్‌ లక్ష్మణ్‌(26), క్లీనర్‌ డాన(22) అన్నదమ్ములు. లారీ యజమాని సూచనల మేరకు మతిన్‌ అనే వ్యక్తి నుంచి మామిపల్లి మెట్రోనగర్‌ కాలనీలో లారీలో బియ్యం, గోదుమలు గుజరాత్‌ రాష్ట్రానికి తరలిస్తున్నారు. వీరితో పాటు ఆసిఫ్‌నగర్‌కు చెందిన డ్రైవర్‌ మహ్మద్‌ యూనుస్‌(50), బిహార్‌కు చెందిన డ్రైవర్‌ అజిత్‌ కుమార్‌(22) బియ్యాన్ని తీసుకొని నగరంలో విక్రయించేందుకు బయల్దేరగా సమాచారం అందుకున్న పోలీసులు వాహనాలను అదుపులోకి తీసుకున్నారు.

తవ్విన రోడ్డు పునర్నిర్మాణం

చైతన్యపురి: చైతన్యపురి డివిజన్‌ సత్యనారాయణపురం కాలనీ నుంచి ప్రభాత్‌నగర్‌ కాలనీ పార్కు వరకున్న పాత రోడ్డు గుంతలు పడి రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఏడాది క్రితం నూతన సీసీ రోడ్డు నిర్మాణం చేశారు. లెవెల్‌ సరిగ్గా లేదని కాంట్రాక్టర్‌ ఇటీవల రోడ్డును పూర్తిగా తవ్వేశాడు. రూ. లక్షలు ఖర్చు పెట్టి వేసిన సీసీ రోడ్డు బాగున్నా ఎందుకు తవ్వారో అర్థం కాక స్థానిక కాలనీవాసులు అయోమయానికి గురయ్యారు. ఈ విషయమై 'లెవెల్‌ లేదని తవ్వేశారు' అనే శీర్షికతో సాక్షిలో ప్రచురితమైన కథనానికికార్పొరేటర్‌ రంగా నర్సింహగుప్తా, ఇంజినీరింగ్‌ అధికారులు పరిశీలించి నూతన రోడ్డు వేయించారు.

నాడు


సాక్షి ఎఫెక్ట్‌..

నేడు
